క్లుప్తంగా

ఆదర్శ రైతుకు సన్మానం



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పాముంజి గోపీని మండల వ్యవసాయాధికారి డి.రఘునాథ్‌రెడ్డి సన్మానించారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ, రైతుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. రైతు గోపీ రికార్డు స్థాయిలో ఎకరాకు 50 క్వింటాళ్ల(5.50 పుట్లు) ధాన్యం పండించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకయ్య, ఆక్వా సొసైటీ డైరెక్టర్ పాముంజి నరసింహ, నేతలు కూనంగారి రమణయ్య, శ్రీహరి కోట ప్రసాద్, కనుపూరు సురేంద్రబాబు, గంపల సుబ్రహ్మణ్యం, వీఏఏ నరహరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



వీఆర్వో రమేష్‌బాబు

ముత్తుకూరు : గుండెపోటుతో వీఆర్వో మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పైనాపురం గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న పులికొల్లు రమేష్‌బాబు (56) నెల్లూరులోని రామలింగాపురంలో నివాసం ఉంటున్నారు. ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతుండగా, హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్‌బాబు మృతికి స్థానిక రెవెన్యూ ఉద్యోగులు, పలు గ్రామాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్బీకే ప్రారంభం నేడు



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పెనుబల్లిలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా తొలుత ఆర్బీకేను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలియజేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని డీఎల్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ పరీక్షను రాష్ట్ర పరిశీలకుడు జేవీ రమణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరు, మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరుకు చెందిన మున్వర్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మనుబోలు : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని బండేపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మేకల సుబ్రహ్మణ్యం(68) గ్రామ సమీపంలోని పోతురాజు గుడి వద్ద ఉన్న తన పొలంలో మిరప చెట్లకు నీరు పెడుతున్నాడు. ఈ తరుణంలో కరెంటు వైర్లు ఫెన్సింగ్ తీగపై పడి ఉన్న విషయాన్ని గమనించలేదు. ఫెన్సింగ్ దాటే ప్రయత్నం చేయడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అప్పటి వరకు తమ కళ్ల ముందు ఉన్న సుబ్రహ్మణ్యం హఠాత్తుగా మృతి చెందాడని తెలియడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించడమే కాకుండా ఇంటి నుంచి తరిమేసిన భర్త, అత్తింటి వారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం పోట్లపూడికి చెందిన అలివేణికి ఇందుకూరుపేట మండలం జంగందొరువుకు చెందిన వేణుతో 2009లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు రూ.ఐదు లక్షల కట్నం, 20 సవర్ల బంగారు ఆభరణాలు, గృహోపకరణాల కోసం రూ.రెండు లక్షలను ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. వ్యసనాలకు బానిసైన భర్త తన కుటుంబసభ్యులతో కలిసి అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఈ ఏడాది జనవరిలో ఇంటి నుంచి అలివేణిని గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబు వస్తే సంక్షేమానికి తూట్లు

- సంక్షేమ పాలనకు మద్దతు తెలపాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కోడూరు బిట్-1లో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : చంద్రబాబు మరోదఫా అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకు తూట్లు తప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోడూరు బిట్-1 సచివాలయ పరిధిలో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం చేపట్టారు. ముందుగా రూ.40 లక్షల నిర్మించిన నూతన సచివాలయ భవనం, సీసీరోడ్లు, ఆర్వో ప్లాంట్లను మంత్రి కాకాణి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరదీపికను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలన కేవలం అంకెల గారడికే పరిమితమందన్నారు. అయితే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యేక్షంగా పరిశీలించడం, అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారికి న్యాయం చేయడమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలందరూ ఆలోచించి మోసం చేసిన చంద్రబాబును పక్కనపెట్టి, ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేత కావలి రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నేతలు కావలిరెడ్డి రవీంద్రరెడ్డి, కె.హరిశ్చంద్రారెడ్డి, కె.సురేంద్రనాథ్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ఆగాల శ్రీనివాసులరెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, నీలమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం, ఎం.చిరంజీవులగౌడ్ పాల్గొన్నారు.

సర్వేరాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలి

- జేసీ కూర్మనాథ్



సర్వేరాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

పొదలకూరు : రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సర్వేరాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. మండలంలోని ఊసపల్లి గ్రామంలో సర్వేరాళ్లను జేసీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ట్రాక్టర్ల ద్వారా గుంతలు ఏర్పాటు చేసి రాళ్ల ఏర్పాటు చేపడితే పనిలో వేగం పెరుగుతుందన్నారు. జేసీ వెంట సర్వేయర్ ఎల్.వెంకటేశ్వర్లు, రైతులు కె.కోటేశ్వరరావు, మాల్యాద్రి ఉన్నారు.

నేడు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 8 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

నెలాఖరులోగా ఈ-కేవైసీ చేసుకోవాలి

- ఏఓ లక్ష్మి



వీఏఏలకు సూచనలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : పీఎం కిసాన్ పథకానికి అర్హులు కావాలంటే ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో మండలంలోని వీఏఏలతో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 3,500 మంది రైతులు వెబ్ ల్యాండ్‌లో నమోదై ఉంటే 2,800 మంది రైతులు మాత్రమే ఇప్పటివరకు ఈ-కేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు. మిగిలిన 700 మంది రైతులు ఈ నెలాఖరులోగా చేయించుకునేలా వీఏఏలు కృషి చేయాలని చెప్పారు.

కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి




కేక్ కట్ చేస్తున్న యూనియన్ నేతలు

ముత్తుకూరు : ప్రాజెక్టులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెడుతామని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ అన్నారు. ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్ రెడ్డితో కలిసి మంగళవారం ముత్తుకూరు బజార్ సెంటర్‌లో ట్రేడ్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి, కేక్ కట్ చేశారు. వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని పరిశ్రమల ఎదుట పతాకాలను ఆవిష్కరించి, ట్రేడ్ యూనియన్‌ను బలోపేతం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఆటో, వాటర్ ట్యాంకర్ల యూనియన్ నేతలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను పెంచుకోవాలి

కోవూరు : చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలని డీపీఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి కోరారు. మండలంలోని ఇనమడుగు గ్రామంలో సర్పంచ్‌లకు జరిగిన శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామ పంచాయతీలు ఆదాయం ఏ విధంగా పెంచుకోవాలనే అంశంపై క్లస్టర్ స్థాయిలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, వాటిని సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకుని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. తొలుత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సర్పంచ్ ప్రమీలమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఇందుకూరుపేట, అల్లూరు మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహన క్యాబిన్ దగ్ధం



నెల్లూరు(క్రైమ్) : షార్ట్ సర్క్యూట్‌తో హైవే మెయింటెనెన్స్ వేహికల్ ఇంజిన్ దగ్ధమైంది. వివరాలు.. గూడూరు నుంచి జాతీయ రహదారిని పరిశీలిస్తూ కావలి వైపు ఎస్టీపీఎల్ హైవే మెయింటెనెన్స్ వెహికల్ బయల్దేరింది. ఈ క్రమంలో చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలో ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో డ్రైవర్‌తో పాటు క్యాబిన్‌లో ఉన్న మరో ఇద్దరు బయటకు దూకేశారు. సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, ఎస్సై గీతారమ్య ప్రమాదాన్ని గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు ఫోమ్, నీటితో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. క్యాబిన్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని నిర్బంధించి బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను నవాబుపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నాగేంద్రనగర్‌లో వెంకటశేషమ్మ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. అద్దెకు ఇల్లు కావాలంటూ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 24న వచ్చి ఆమెను నిర్బంధించి రెండున్నర సవర్ల చైన్, అర సవర కమ్మలను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు తెలిపిన వివరాలు, సమీపంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను బంగ్లాతోటకు చెందిన అన్నదమ్ములు పవన్ కల్యాణ్ అలియాస్ క ల్యాణ్, నవీన్‌గా గుర్తించి వారి కోసం గాలింపు చ ర్యలు చేపట్టారు. నిందితులను మైపాడు గేట్ సెంటర్‌లో అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసై చోరీల బాట పట్టారని తెలిసింది. తొలిసారిగా దోపిడీ చేసి పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో..

నెల్లూరు(క్రైమ్): సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటకు చెందిన ప్రశాంత్ ఆర్టీసీ సమీపంలోని పెంచలమ్మ హాస్పిటల్లో పని చేస్తున్నారు. ఇటీవల ఆయన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రశాంత్‌కుమార్ వీఆర్సీ సెంటర్‌లో సెల్‌ఫోన్‌ను విక్రయించేందుకు మంగళవారం యత్నిస్తుండగా, అనుమానంతో చిన్నబజార్ ఎస్సై లేఖాప్రియాంక అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా, హాస్పిటల్లో సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన విషయాన్ని అంగీకరించారు. దీంతో అతడ్ని అరెస్ట్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

గడప గడపలో విశేషాదరణ



బాండ్లు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో ప్రజల నుంచి విశేషాదరణ లభిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు మండలం రామలింగాపురం, గౌరీపురం, ఆంజనేయపురం ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు 58 వేల గడపలకు తిరిగినట్లు తెలిపారు. ఆంజనేయపురం, వెంకటనారాయణపురంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ నిధులు రూ.14 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో సీసీరోడ్లు వేయాలని స్థానికులు కోరగా, వెంటనే సచివాలయాల నిధుల నుంచి రూ.5 లక్షలతో రోడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎంపీపీ భారతి, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బుచ్చింగారి తిరుపతి, పార్టీ నేతలు ఎ.వాసు, కె.సుబ్రహ్మణ్యం, పి.అచ్యుత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమణమ్మ, చంద్రయ్య, చెంచురత్నం, హరి, తిరుపతి, రామలింగయ్య, ఎ.సుధీర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా చేయూత

ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న ఆర్థిక సాయం అందించారు. పురిణి లోహిత, లోకేష్, అశోక్, పల్లవి అనే చిన్నారులకు రూ.20 వేల చొప్పున వరిణి సొసైటీలో డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్లను వారికి అందజేశారు. కారుణ్య అనే చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.50 వేల నగదును అందించారు. రామతీర్థం ప్రాంతానికి చెందిన ఇద్దరు వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లను అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

- సీడీపీఓ జ్యోతి



కొడవలూరు : గండవరంలో పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ జ్యోతి

కొడవలూరు : పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని కోవూరు సీడీపీఓ జ్యోతి తెలిపారు. మండలంలోని గండవరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్సార్ కిట్‌లు, బాలామృతంలతో పాటు పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా చిరుధాన్యాల్లోనూ పుష్కలంగా పోషకాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణ, సెక్టార్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, హెల్త్ విజిటర్ రత్నకుమారి, మహిళా పోలీసు శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామన్నపాళెంలో..

మండలంలోని రామన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ, ఈఓపీఆర్డీలు జ్యోతి, వి.నాగరాజులు హాజరై చిరుధాన్యాల ఆవశ్యకత, పోషకాహార లోపం తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణ, సెక్టార్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, మహిళా పోలీసు ప్రభావతి, ఉపాధ్యాయిని జె.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే రక్తహీనతను నివారించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు రమణమ్మ, ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని కొండూరుసత్రం, బద్దెవోలు-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఇచ్చే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పకుండా తీసుకోవాలన్నారు. మహిళల్లో రక్తహీనతను నివారించేందుకు కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు, మినుములు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గుమూడి శశికుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం, గ్రామపెద్ద భీమవరపు బాలకృష్ణారెడ్డి, అంగన్‌వాడీలు విజయమ్మ, సుబ్బరామమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

తప్పక తీసుకోవాలి

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పక పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత, ఇతర వ్యాధులు లేకుండా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.పద్మజ పేర్కొన్నారు. అమ్మవారిపాళెం సెక్టారు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారానికి సంబంధించిన వివిధ పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, జయలక్ష్మి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముత్తుకూరు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. పంటపాళెం పంచాయతీలోని కోళ్లమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు మాట్లాడుతూ ఆహార విషయంలో గర్భిణులు, బాలింతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, సూపర్‌వైజర్ రంగమ్మ పాల్గొన్నారు.



మనుబోలు : బద్దెవోలులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న రమణమ్మ



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్



ముత్తుకూరు : మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



కొడవలూరు : రామన్నపాళెంలో..

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ నగదును లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 28వ తేదీ వరకు అనగా 113 రోజులకు గాను హుండీ కానుకలను లెక్కించినట్లు తెలిపారు. రూ.52,56,345ల నగదు రాగా, 146 గ్రాముల బంగారు వస్తువులు, 240 గ్రాముల వెండి వస్తువులు వచ్చాయన్నారు. యూఎస్ఏ డాలర్లు 21, కెనడా డాలర్లు 15, మలేసియా రింగేట్స్ 1, సౌతాఫ్రికా ర్యాండ్స్ 10,000 హుండీ ద్వారా భక్తులు సమర్పించినట్లు తెలిపారు. దీంతో పాటు అన్నదాన హుండీ ద్వారా రూ.2,24,472 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, శశిశేఖర్‌శర్మ, బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల అందజేత



ఇందుకూరుపేట : మండలంలోని పున్నూరులో శ్రీకృష్ణ రైతుమిత్ర గ్రూపు సభ్యులకు వ్యవసాయ ట్రాక్టర్ పనిముట్లను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొల్లపల్లి అవినాష్, ఏఓ రఘునాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నరేష్, రైతులు పాల్గొన్నారు.